# నేనూ తల్లినే

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

ఆ అమ్మాయికి క్షణం తీరుబాటు కనిపించదు. రంగుల రాట్నంలాగ తిరుగుతూనే వుంటుంది. ఇంట్లో వున్నదంతా కూనా, గుజ్జూనూ. ఈ అమ్మాయే ఆరిందా! పట్టుమని పద్దెనిమిదేళ్లుకూడా లేవు. అమ్మ వున్నంత వరకు యేపని చేసినా, బాధ్యతా, బరువూ వుండేవి కావు. చలాకీగా యిట్టే వెళ్లి అట్టే వచ్చేది. కాని యిప్పుడట్లా కాదు, ఎక్కడికి కాసేపు వెళ్ళినా సరే, యింట్లో యేమవుతోందో అనే ఆదుర్దా ఆమెను వెంటాడుతూనే వుంటుంది. ఈ దుర్ఘటనలో చదువు పూర్తిగా స్వస్తి చెప్పాలిసే వచ్చింది ఇప్పుడసలు తీరుబడన్న మాటేలేదు. కాస్త వీలుచేసుకుని అన్నంముందు కూర్చోవటమే ఘనమనిపిస్తోంది. అమ్మంటే తనకెంత ప్రేమ అలాంటి ప్రేమ స్వరూపిణీ అందర్నీ విడిచి వెళ్ళిపోయింది. తండ్రి లోపే లోపల బాధ పడుతూ టిక్కు టిక్కుమంటూ వుంటాడు. ఆయనిది కానరాని బాధ. పిల్లలముందు వెళ్ళబుచ్చేది కాదు. లోపల లోపల దహించుకుపోతూ వుంటుంది, చల్లారనిమాట. పిల్ల[illegible]తె జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అవురుమంటారు. అమ్మవున్నంతవరకు అందర్నీ సమానంగా చూసేది. ఆమె ప్రేమను అందరూ పంచుకునేవారు. ఇంతమంది పిల్లలున్నప్పటికీ ఎవరికెప్పుడు ఏది కావాలో గమనిస్తూ అందరి అవసరాల్నీ తీర్చుకుంటూ వచ్చేది. ఇప్పుడా పని ప్రభావతిమీద పడింది. సహజంగా చురుకుగలది. ఇట్టే దేన్నైనా ఆకళింపు చేసుకోగలదు.

పిల్లల్ని చుట్టూ కూర్చోపెట్టుకుని మా రత్నాలు, వజ్రాలు అంటూ మురిసిపోతూ వుంటాడు తండ్రి. పేరు పేరునా పెట్టి పిలుస్తూ, అందర్నీ దగ్గరకు తీసుకుంటూ వుంటాడు. నాన్న పేరు పెట్టి పిలుస్తుంటే పిల్లలకు చెప్పలే సంతోషం, ఆనందం, ఆ యింట్లో పిల్లపుట్టినప్పుడల్లా పెద్ద ఉత్సవమే. తండ్రి మామూలుగా ఆ వార్త వినటానికి ఆదుర్దాగా ఎదురుచూస్తూ వుండటం, తల్లి పిల్లను దగ్గరకు తీసుకుని మనసారా ముద్దులాడటం, ప్రభావతికి బాగా తెలుసు. ప్రతి కాన్పుకు కూడా డాక్టర్ సలహా యివ్వటం, కృత్రిమంగా మనం ఏమి చెయ్యకూడదు దైవ మిచ్చే బిడ్డలు అని తల్లితండ్రులు యిద్దరూ కూడ ఒకే అభిప్రాయంతో ఉండటం పరిపాటయిపోయింది. చివ్వరికి ఆఖరిదియు రానే వచ్చింది తల్లి ఎనిమిదో బిడ్డను కనటం, యీ లోకాన్ని వీడిపోవటమూనూ ఆ క్షణంలో తండ్రి నిబ్బరంగా వుండిపోయాడు. తనను శాశ్వతంగా వీడిపోయిన జీవిత సహచారిణిని చిరసాక్షిగా చూశాడు. ఆయన కళ్లు ఎర్రబారాయి. కాని పొడిగానే వుండిపోయినాయి. అంతా అయిపోయింది. తీరా యింటికి వచ్చేటప్పటికి, యింతమంది పిల్లలున్నా యిల్లంతా బోసి బోసిపోయినట్టుంది. ఆమె లేని లోటు ఎంత మందివున్నా తీర్చలేకపోయారు. ఆమె కేవలం ఒక్క వ్యక్తే కాదు. అందర్నీ బంధించి ఒకరిమీద ఒకరికి ప్రేమ, ఆప్యాయతలు కలిగించగలవ్యక్తి ఆమె తల్లి ఆ యింటి యిల్లాలు. తండ్రి ఆవుతే పిచ్చివానిలాగ, ఆ మూలకు యీ మూలకు వెళ్ళచూసి పెద్దపెట్టున ఏడ్చాడు. అమూల్యమైన ఆభరణాన్ని పోగొట్టుకున్నట్లయింది. ఆయన అదివరకు మాదిరిగా వుండలేకపోతున్నాడు.

పిల్లలు బిత్తరపోయి, లోపల తెలియని ఆవేదనలో కుంగిపోతున్నారు. అందర్నీ కూడా పెద్దపెట్టున భయం ఆవహించింది. కొన్నాళ్ళదాక, ఏపనిచేసినా, ఏమి మాట్లాడినా, అమ్మ మాటే జ్ఞాపకంవచ్చేది. మరీ ఎడపిల్లలు, నోరు జారి అమ్మా అని పిలవటం, బా[illegible]రుమని మరుక్షణం ఏడవటం, మరింత బాధగావుంది. ఒక పెద్ద బండరాయి నెత్తిన పడ్డట్లయింది. భరించలేని దుఃఖము, ముందు ముందు మనం యెట్లా వుండగలము అనే ఆలోచన వెర్రెత్తించేస్తోంది ప్రభావతిని.

అమ్మా! ఆకలే!... అన్న పసిపిల్లమాటలు, ఆమె హృదయంలోకి వాడిగ గుచ్చుకొనిపోయినాయి అంతా తల్లిలేని పిల్లలే! అన్నది నిజమే యిది భరించలేని ఆవేదన, కాని అంతమంది అన్నం తినాలి. రోజులు గడుపుకోవాలి తప్పదు. పోయినవాళ్ళకోసం యెంతసేపు యేడ్చినా యేం లాభంలేదు. అందరికీ తెలిసి కూడా, ఆ సమయంలో ఆపుకోలేరు అట్లాగే యీపిల్లలూను, ప్రభావతికి రెండురకాల బాధలు, తల్లిపోయిందనే బాధ. వీళ్లందర్నీ యెట్లా సాకుతూ వస్తానా అనే ఆరాటమూ, మర్నాడే వెళ్ళి ఆసుపత్రినుంచి పసిపిల్లను తీసుకువచ్చారు. మొట్టమొదట ఆ నెత్తురు గుడ్డను చూడంగానే ప్రభావతికి అసహ్యం వేసింది. ఇదేగదా అమ్మను చంపింది అనుకుంది. కాని ఆ చిన్నచేతులు, ఆ చిన్ని కళ్లు, బుగ్గలు చూస్తుంటే, అచ్చగా తల్లిపోలికే నిజంగా అమ్మలాగానే వుంది అనుకుంటూ ఆప్యాయంగా దగ్గరగా తీసుకుంది. ఇప్పుడు ఆ వయస్సులోనే యింతమంది పిల్లలకు 'తల్లి' అయి కూర్చుంది ప్రభావతి. ఇక తనసంగతి చూసుకోవడానికే అవకాశం లేకుండా పోయింది.

రానురాను ఆమె మనస్సు మొద్దుబారి పోయింది. తాను చిన్నప్పుడు ఎన్నో కలలు కన్నది. పెద్దచదువు చదవాలని, తాను పదిమంది ఆడవాళ్ళల్లోనూ ప్రత్యేకత సంపాదించుకోవాలని, తనని గురించి, నలుగురూ చెప్పుకునేటట్లు చెయ్యాలని అనుకుంది. అవన్నీ మాసిపోయినాయి ఇప్పుడు తాను, యితరుల బాగోగులు చూడాలసిన అవసరం యేర్పడింది. తనని తాను పూర్తిగా మరిచేపోవాలి. తననిగురించి ఆలోచించుకోవటం మానెయ్యాలి. ఎంత జాగ్రత్తగా పట్టుకొస్తే, వీళ్ళు పెరిగి పెద్దవాళ్ళవటము. అమ్మకున్నంత సహనము, ఓర్పు, ఓపిక, తనకున్నాయా యీ

పనులు తాను చెయ్యగలనా అంటూ ఆశ్చర్య పోతూ వుంటుంది. చాకిరీ చేసినప్పుడు, ఎవ్వరూ యేమి అనరు, కాస్త విసుక్కున్నా కోప్పడ్డా, అమ్మవుతె యిట్లా అనదు. అని చెల్లెలో, తమ్ముడో అనటం, దాంతో ఆమె పూర్తిగా క్రుంగిపోవటము. ఎప్పుడూ భగవంతున్ని ప్రార్థిస్తూ వుంటుంది తనకు తగినంత బలము, శ్రద్ధ ప్రసాదించమని, ఇక తండ్రి చూడబోతే, యేమీ పట్టించుకోడు. వేళకు యింత అన్నం తింటాడు, పడకకుర్చీలో పడుకుంటాడు, తన కింకెవ్వరితోనూ యేమీ సంబంధంలేనట్టు మౌనంగానే వుండిపోతాడు. ఇంట్లో పిల్లలు అల్లరిచేస్తూ అక్కయ్యమాట వినక వేధిస్తూవుంటే, ఓసారిగా మాట అన్నాడు, మీరందరుకూడా అక్కయ్య చెప్పినట్టు వినాలి. మీ అందరికోసమని స్కూలు కూడా మానేసి మీపనులే చూస్తోంది అని. ఈమాటలు, ప్రభావతిని ఆనందపరిచినాయి. సంతృప్తిగా నిట్టూర్చింది.

బళ్లోకి వెళ్ళేపిల్లలు వెళ్ళిపోయినతర్వాత, పసిపిల్లల్ని పెట్టుకుని తీరిగ్గా ఆడుకుంటూ వుంటుంది. రొష్టు లేకుండా ఎవరి పనులు వారు చేసుకుంటూ, అమ్మ స్థానంలో అక్కయ్యను చూస్తూ సంతృప్తి పడుతున్నారు.

పిల్లలు పెరుగుతున్నకొద్దీ ఖర్చులు జాస్తి అవుతున్నాయి. తండ్రికి వస్తున్న పెన్షన్, యింకా పొలాలమీద వస్తున్న ఐవేజు సరిపోవటంలేదు. ఖర్చు యెంత తగ్గిందామనుకున్నా సాధ్యపడటంలేదు. అన్నీ అవసరాలుగానే కనిపిస్తున్నాయి. అందులో పిల్లలకు కోరికలు ఎక్కువయినాయి. అవసరాలకు ఖర్చు పెట్టే డబ్బులో కొంత దుబారాకు పోవటంవలనకూడా, మరీ కటువుగా వుంది. నాన్నని అడుగుతే, నీ యిష్టమమ్మాయి, యేది తగ్గించాలో నువ్వే ఆలోచించుకో అంటాడు. అంతా పెత్తనం ఆ అమ్మాయిదే అయిపోయింది. ఇట్లా వుండగా తండ్రికి పెద్ద జబ్బు చెయ్యటం, దానికి బోలెడంత ఖర్చవటం జరిగింది. జబ్బు నయమయిందన్నమాటే గాని, ఎక్కువకాలం బతుకుతాడనే ఆశ యెవ్వరికీకూడాలేదు. చివరి ఘడియల్లో అమ్మమాట పదే పదే చెపుతూ, కళ్ళు మూశాడు. ఇక మిగిలిందల్లా పిల్లలే, తండ్రి దగ్గర చనువయిన పిల్లలు బెంగతో చాలా రోజులదాక బాధపడ్డారు. ఇక యీపిల్లలకు రోగాలు, నొప్పులు, అన్నీ చూసుకుంటూ సముదాయింపులు, ఓదార్పులు చేసుకొంటూ ప్రభావతి మెల్లి మెల్లిగా భవిష్యత్తులోకి అడుగులు వేస్తోంది. ఇప్పటికి పిల్లల్ని పెంచటం పసిపాపలకు నీళ్లుపొయ్యటం అన్నింటిలోనూ చక్కగానే తర్ఫీదు పొందింది. పెళ్ళి కాక మునుపే, పిల్లల ముచ్చట్లన్నీ తీర్చుకుంటోంది. ఓ యకరం పొలం అమ్మేసి చిల్లర బాకీలను తీర్చేసింది. పెద్ద తమ్ముడు యస్. యస్. యల్. సి. ప్యాసవంగానే, చిన్న ఉద్యోగంలో చేర్పించింది. రెండోవాడు ఫ్యాక్టరీలో చేరాడు. మొత్తంమీద నెల అయ్యేటప్పటికి నాలుగురూపాయలు చేతిలో కనిపించటం, బొటాబొటిగా ఖర్చులకు సరిపోవటం అవుతోంది.

ఏళ్లు గడిచిపోతున్నాయి. పిల్లలు ఎదిగి పెద్దవాళ్ళయిపోయారు. సంపాదనకు నలుగురొచ్చారు. నెల అయ్యేటప్పటికి, యిదిగో అక్కయ్యా మా జీతం, అంటూ చిల్లర ఖర్చుకు కొంత వుంచుకుని, మిగతా డబ్బు ప్రభావతికే యిస్తారు. ఆమె యింటి విషయం చూసుకుంటూ వుంటుంది. ఉన్నట్టుండి, మూడో చెల్లెలికి అమాంతం నోరు పట్టుకుపోయింది. గాభరాగా డాక్టరుకు కబురుచేసింది. అతనొచ్చి యింజక్షన్ కేప్సిల్స్ యిచ్చాడు రెండు గంటలకుగాని, నోరు కదపలేకపోయింది అమ్మయ్య భగవంతుడా అని నిట్టూర్చింది. డాక్టరు రోజుకు రెండు మూడుసార్లు రావటం ఆ అమ్మాయిని పరీక్ష చెయ్యటం, ఆదుర్దాగా ప్రభావతివేస్తున్న ప్రశ్నలకు నింపాదిగా సమాధానాలు యివ్వటమూ, కాస్తంత ఓదార్చటమూ చేస్తున్నాడు.

ఆస్తమానం, మీరు టైర్ అయిపోయినట్లు కనిపిస్తుంది. కాస్త రెస్టే తీసుకోండి. మీ చెల్లెలికేమి భయంలేదు అని డాక్టరన్నాడు.

ఈ మాత్రం మాటలు, తనకంటె పెద్దవాళ్ళ నోటినుంచి విని ఎన్నో యేళ్లయింది. ఈజాలి మాటలు ప్రభావతిని యెక్కువగా వూరడించినాయి.

కాస్త మనస్సుకు శాంతిగానూ వుంది. ఎందుకో యీమాటలు వింటుంటే తెగభయపడింది ఎన్నడూ రాని, ఆలోచన. ఊహా ఆమె మనస్సులోకి చొరబడ్డాయి. పిల్లలన్నా తర్వాత ఏవో రోగాలు వస్తూనేవున్నాయి. చీటికి మాటికి ఆ డాక్టరు పిల్వంటికి రావటమూ తప్పలేదు. దీంతో ప్రభావతికి అతి సన్నిహితంగా పరిచయమవుతూ వచ్చాడు. డాక్టరితో మాట్లాడుతున్నంతసేపు ఆమెకు అదో కొత్త అనుభూతిగా వుంది తనలో మరుగుపడిపోయిన ఆశాభావాలు రేకెత్తుతున్నట్లు కనిపించినాయి. ఈమె పరిస్థితి అంతా పూర్తిగా గ్రహించి, దానికి అనుగుణంగా మాట్లాడుతున్నాడు, దాంతో యింకొంచెం హాయిగా వుంటోంది. యిట్లా యిద్దరి పరిచయంకూడా బాగా పెరిగిపోయింది. చివరికి యిద్దరుకూడా ఒకరొకరు ప్రేమించుకున్నట్లు తెలుసుకున్నారు. ఇద్దరూ ఓనాడు పెద్దహడావడేమీ లేకుండా పెళ్ళికూడా చేసుకున్నారు.

ఇక ఒకరి కష్టాలు ఒకరు చెప్పుకుంటున్నారు. కుటుంబనియంత్రణ గురించి విచ్చలవిడిగా మాట్లాడుకుంటున్నారు. ఆడది ప్రతియేటా కనటం, చాలా ప్రమాదం ఆరోగ్యం నష్టం, పిల్లలను పోషించలేక బాధపడటం, చివ్వరికి ప్రాణానికే మోసం తెచ్చుకోవటం, మీ అమ్మ చూడరాదా ఏమయింది చివరికి, యింతమంది పిల్లలు లేకపోతే యింకా యిప్పటికీ ఆమె బతికివుండేదే! ... ... అన్నాడు డాక్టరు.

తల్లిని గురించి, తన భర్త అన్న మాటలు యెంత సత్యాలైనా; కటువుగానే అనిపించినాయి ప్రభావతికి, ఏమీ మాటాడలేదు. నిజమని లోపల తెలుసుకున్నా బైటకు ఏమీ అనలేకపోయింది. అప్పటికీ తమాయించుకుని, మా చివరి చెల్లెల్ని చూస్తే, మీరు యెంతో పొగుడుతారు. మరి యీమాట లెందుకండీ అన్నది

నేను అందుకు అనటంలేదు. ఆ అమ్మాయి మన కళ్లయెదుట కనిపిస్తోంది కాబట్టి చాలా అందంగావుంది, స్మార్ట్‌గా వుంటుంది అనుకుంటాం. ఆ అమ్మాయే పుట్టకుండాపోతే ఆ ప్రస్తావనే వుండదు. అంతే ... కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను మనం గుర్తించాలి. అంతే నేను చెప్పేది అన్నాడు.

అర్థమయిందన్నట్లు, ప్రభావతి సంతృప్తిగా, భర్త మొహంలోకి చూసింది. కాని డాక్టరుకు పూర్తిగా నమ్మకం కలగలేదు. మళ్ళీ రెట్టించి అడిగాడు. నా ముఖప్రీతికోసం చెప్పద్దు నీ ఉద్దేశమేమిటో చెప్పు అన్నాడు. అయితే, నాకూ కూడా బోలెడంతమంది పిల్లలుండాలని వుంది... అన్నది ప్రభావతి సిగ్గుతో తల వంచుకుని.

'పోనీ అంత పిల్లలంటే సరదా అయితే ఒకళ్ళిద్దరు వుంటే చాలదా! ... అదైనా యిప్పుడు కాదు మనం లైఫ్‌లో పూర్తిగా సెటిల్ అయినతర్వాత!...

ప్రభావతి కేమిటో యీ మాటలు నచ్చలేదు. చిన్నకుటుంబం అంటే చెడ్డచిరాకు. ఇంటినిండా పిల్లలుండాలని ఆమె అభిప్రాయం. పిల్లలకోసం, కొన్నేళ్ళు ఆగాలని, మళ్ళీ ఆదొక ప్లాన్ చెయ్యాలని, యివన్నీ ఆమెకు గిట్టవు, మనకు జీవితంలో యెన్ని కంఫర్ట్సు వున్నప్పటికి పిల్లలతో సాటిరావు. అని ఎంతో వాదించింది.

ఇన్నేళ్ళుపట్టీ, పిల్లల్ని పెంచటంతో, పిల్లలంటే తగమమకారం ఏర్పడింది. చెల్లెళ్ళు తమ్ముళ్ళు పెద్దవాళ్ళయి యెవరిదోవన వాళ్ళు వెళ్ళిపోతున్నారు. ఇన్నాళ్ళుబట్టి, వాళ్ళతో కాలక్షేపం చేసింది. ఇక తనయిల్లు, భర్త యేర్పడ్డ తర్వాత, పిల్లలంటూ తప్పక వుండి తీరాలని గట్టి పట్టుదలతో వుంది. పైగా భర్తకు అభయం యిస్తోంది కూడా, తాను ఎంతమంది పిల్లల్ని కనటానికైనా సిద్ధంగా వున్నానని, దానికి తగిన ఆరోగ్యముందని. డాక్టర్‌కు వున్న నిశ్చితాభిప్రాయాలు, ప్రభావతి యెన్నిసార్లు చెప్పినా మారలేదు. చెల్లెళ్ళు, తమ్ముళ్ళూ తలోకదారిన పోయారు. చివర్ని యిద్దరు చెల్లెళ్ళు ప్రభావతిదగ్గరే వున్నారు.

ఆనాడు సాయంత్రం అవతోందనగా, చిన్నచెల్లెలు పెద్దపెట్టున ఏడుస్తూవచ్చింది. అక్కయ్యా, సునీతఅక్కయ్యేమో చచ్చిపోవాలని మందేదో తిన్నదిట అంటూ ప్రభావతి ఉలిక్కిపడింది. ఏమయిందేమిటి అంటూ ఆవేదనగా సునీతను దగ్గరకుతీసి యెంతో సేపు అడిగింది. నిజం బైటపెట్టింది. అయితే ప్రభావతి యేమీ అనలేదు. పైగా చెల్లెల్ని చూసి జాలిపడింది! అతనెవరో చెప్పమని తెలుసుకుని చివ్వరికి యిద్దరికీ పెళ్ళయ్యేటట్లు చేసింది. రోజులు గిర్రున తిరిగాయి. మళ్ళీ తలింట్లో యింకో పసి పాప వచ్చింది. ఆ పాపను చూసి ప్రభావతి యెంతగానో మురిసి పోయింది. తమ్ముడికో పాపపుట్టినట్లు కబురొచ్చింది. రెండో చెల్లెలికి కవల పిల్లలుట! ఎక్కడ చూసినా పసిపాపలే, కాని తనకు మాత్రం లేరు. అయితే వీళ్ళందర్నీ చూసి అసూయ పడకుండా వుండాలనే ప్రయత్నం చేస్తోంది.

ఇప్పటికి ముప్పయి యేళ్లొచ్చినాయి. ఇంటి వ్యవహారాలు చూసుకోవటం, పిల్లల్ని సాకటం క్షుణ్ణంగా నేర్చుకుంది. ఇదే ఆమె కొచ్చిన అనుభవమల్లా. మూడో తమ్ముడు ముగ్గురు పిల్లలతోనూ, భార్యతోనూ దిగాడు. మళ్ళీ యింటినిండా పిల్లలు తయారయ్యారు. డాక్టర్‌కి మతిపోయినట్లనిపించింది. ఈ పిల్లలేమిటి! ఈ సంసారమేమిటి! ఈ గొడవేమిటి! మనకు పిల్లలు వద్దనుకుంటుంటే, వీళ్ళంతా యేమిటి మనకి అన్నాడు. మీరు నా కోరిక చెల్లించాల్సిందే అని గట్టిగా పట్టు పట్టింది. డాక్టర్ చివ్వరికి లొంగిపోయినట్లు నటించాడు.

ఏడాది గడిచింది. ప్రయోజనం లేకపోయింది. ముప్పయి అయిదేళ్ళు వస్తున్నాయి. ఇంకా ప్రభావతికి పిల్లలు కలగలేదు. తనచేతి కింద పెరిగి పెద్దవాళ్ళయిన వాళ్ళందర్నీ చూస్తుంటే, తన సొంత పిల్లలున్నా, యింత కంటె యెక్కువగా ప్రేమించేదాన్ని కానేమో అనుకుంటూ వుంటుంది. కాని, తనకు సంతానం కలగాలనే కోరికను మాత్రం చంపుకోలేకపోతోంది. బహుశా భగవంతుడు యింతమంది సాకిననాకు సంతానాన్ని ప్రసాదిస్తాడని గట్టి నమ్మకం వుంది. ఎప్పటికైనా, నా పిల్లనికూడా నా చేతుల్లోకి తీసుకోగలుగుతాననే విశ్వాసమే యింకా నాకు శక్తినీ, ధైర్యాన్ని యిస్తోంది, అనుకుంటూ వుంటుంది.

రోజులు గడిచిపోతున్నాయి. మళ్ళీ ప్రభావతి యెన్నడూకూడా పిల్లల విషయం, భర్తతో ప్రస్తావించలేదు. అతనూ యేమీ మాట్లాడలేదు.

అప్పుడప్పుడు అమ్మమాట తలుచుకుని దుఃఖిస్తూ వుంటుంది. పాపం అమ్మ చచ్చిపోయింది. తన భర్తన్నమాట నిజమే. అమ్మ నిజంగా యింతమంది పిల్లల్ని కనే చచ్చిపోయింది అప్పుడెవ్వరికీ తెలీదేమో! తెలిసినా ఆ పద్ధతులు తప్పని ఊరుకుని వుండచ్చు. తెలుసుకునికూడా, నాకు ఎంతమంది పిల్లలుండాలని అనుకోవటంయేమిటి! ఇప్పుడు నేను సాకిన పిల్లలంతా, నా పిల్లలు కారా! తల్లిగా నా మనసు నా కోర్కెలు అన్నీ తీరిపోయినాయి. విధి నిర్ణయం ఎట్లా వున్నా, మనంచేసే ప్రయత్నంలో లోపం వుండకూడదు. అంతే పూర్తిగా మనస్సుకు నచ్చ చెప్పుకుంది.

'ప్రభా!...ఏమిటివాళ అట్లా వున్నావ్' నవ్వుతూ అడిగాడు డాక్టర్.

'ఎట్లా వున్నాను!... మీతో ఓమాట చెప్పామనుకుంటున్నా...' పిల్లలంటే నాకిది వరకున్నంత మోజు లేదండీ!...' అన్నది నవ్వు మొహం పెట్టి.

'ఏమైనా కాని, నువ్వు యీసారి నిజంగా తల్లివవుతావు!...' అన్నాడు సంతృప్తిగా ప్రభావతి కళ్ళలోకి చూస్తూ.

నిజమే కావచ్చునన్నట్లు తలవూపింది ప్రభావతి, చేతిలోవున్న పేపర్లో మొహాన్ని దాచుకుని.

---


అతి త్వరలో విడుదల

రాగరేఖలు

కథా సంపుటి

సంకలనం :

కె. ఆర్. కె. మోహన్

ప్రతులకు :

శ్రీ ముఖ పబ్లికేషన్స్

మచిలీపట్టణం.